# మైత్రేయుడు

బస్సు రాకకు యింకా అరగంట టైమ్ వుందని తెలియగానే నాలో ఎక్కడలేని నిరుత్సాహం వచ్చింది. నీరసంగా బస్సుస్టాండులో పచార్లు చేస్తున్నా.

"ఏమోయ్? చాలాకాలానికి! బాగున్నావా!" అన్న మాటలతో నా భుజం మీద చెయ్యి వేసిన వ్యక్తిని ఒక్కమారు ఆపాదమస్తకం చూసాను.

గ్లాస్కో పంచ సిల్కు లాల్చీ, కళ్ళకు రోల్డుగోల్డు ఫ్రేమ్ కళ్ళద్దాలు, అర్థశతమానం వయస్సు పైబడ్డ ఆ శ్రీమంతుడెవరాని ఆశ్చర్యపోతూ.

"బహుశా ఆయన నన్ను చూసి తన వాళ్ళెవరేనా అనుకుని పొరపాటు పడ్డాడేమో" అనుకున్నాను.

"అమ్మా, నాన్నా అంతా కులాసా?" అన్నారు చిరునవ్వుతో

"ఆఁ" అన్నాను పరధ్యానంగా.

"రా, కాస్త కాఫీ త్రాగుదాం" అంటూ నా సమాధానం కూడా వినకుండా ఎదురుగా వున్న హోటలు వేపు దారితీసారు.

నేను మంత్రముగ్ధునిలా అతని వెంట నడిచాను.

"ఓ మహాశయా? పంకా స్పీడు కొంచం హెచ్చించు. మరీ ఊపిరి లేనట్టు తిరుగుతూంది" అంటూ హోటల్ ప్రొప్రయిటర్‌కి కేకవేశారు కుర్చీలో కూర్చుంటూ.

నేను ఆయనకు ఎదురుగా ఖాళీగా వున్న మరో కుర్చీలో కూర్చున్నాను.

"ఎందాకోయ్! ప్రయాణం?"

"వైజాగండీ" అన్నాను.

"రెండు ప్లేట్ పెసరట్- ఉప్మా" అన్నారాయన మా టేబిల్ దగ్గరకొచ్చిన సర్వర్‌తో.

"నాకు టిఫెనేమీ వద్దండీ" అందామనుకున్నా కాని ఆయనేమనుకుంటారోనని వూరుకున్నాను.

"చిన్నప్పుడు మా ఆవిడ చంక ఒక్కమారు కూడా దిగేవాడివిగాదు నువ్వు!" అన్నారు టిఫిన్‌ప్లేటు ముందుకు లాక్కుంటూ.

నేను సమాధానంగా చిరునవ్వు నవ్వి వూరుకున్నాను.

"వాడ్ని కావలిస్తే తీసుకెళ్ళి పెంచుకోరాదూ!" అనేవాడు మీ నాన్న-

"కాని అంత అదృష్టం మాకుండొద్దూ? ఏదో మాటవరస కన్నాడుకాని నిజంగా యిచ్చాడా?" అన్నారు చిరునవ్వుతో.

"నిన్ను చూడాలని మా ఆవిడ నేనూ ఎన్నోమార్లు అనుకున్నాం కాని జరిగితేనా?"

"చూడు పేపర్ రోస్టు దోసె రెండు ప్లేటు పట్రా" అన్నారు సర్వరుతో.

"నాకొద్దండీ! నేను మరి తినలేను మీ కోసం ఒక్క ప్లేటు తెమ్మనండి" అన్నాను.

"ఆ కుర్రాడి మాటలకేం నువ్వెళ్ళి త్వరగా తే" అంటూ సరవర్ని పంపించారు.

"చిన్నప్పుడు కూడా ఏదైనా తినడానికి యిలానే అల్లరిపెట్టేవాడివి తెలుసా?" అన్నారు నవ్వుతూ.

ఆయన నా చదువు, ఉద్యోగం గురించి వివరాలన్నీ ఆప్యాయంగా అడుగుతూ కాఫీ మెల్లిగా ఒక్క గుక్కడు త్రాగేసరికి బయట బస్సు హారన్ వినిపించింది.

"అరెరే! మా బస్సు అప్పుడే బయలుదేరి పోయిందే?" అంటూ గాభరాగా లేచాడు.

"నే వెళ్ళొస్తానోయ్! యీ మారు మాయింటికి తప్పకుండా రావాలి సుమా!.... మరి బిల్లు-?" అంటూ జేబులో చెయ్యి పెట్టి పర్సు బయటకు తీసారు.

"ఫరవాలేదు నేనిస్తా, మీరు త్వరగా వెళ్ళండి.... లేకుంటే బస్సు అందదు" అన్నాను.

"థాంక్సు! మరయితే వస్తా" అంటూ గబగబ బయటకు నడిచారు.

"పాపం! ఆయన కాఫీ పూర్తిగా త్రాగడానిక్కూడా వీలులేకపోయింది. యీ బస్సులంకోసం మనం వెయిట్ చేయాలే కాని అవి మనకోసం వెయిట్ చేస్తాయా?" అనుకుంటూ కాఫీ త్రాగడం పూర్తిచేసి మా యిద్దరి బిల్లు చెల్లించి బయటకు వచ్చాను.

ఆయన ఎదురుగా వున్న పాన్‌షాపు దగ్గర తీవిగా నిల్చుని సిగరెట్ కాలుస్తూండడం చూసి ఆశ్చర్యపోయాను.

"ఏవండీ! బస్సందలేదా?" అన్నాను. ఆతృతగా ఆయన్ని సమీపిస్తూ.

ఆయన నా వేపొకమారు చూసి చిన్న చిరునవ్వు నవ్వుతూ "ఎవర్రా నువ్వు" అన్నట్లు ముందుకు సాగిపోయేసరికి నేను నిలువునా స్తంభించిపోయాను.

*ప్రజామత వీక్లీ, 26-1-1964*